
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 16 సెప్టెంబర్ 2024
www.ntnews.com




కథాసుధ

# చీమ తెలివి



**ఓ** పల్లెటూరి విద్యార్థి మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. ఉన్నత చదువుల కోసమని వసతి గృహంలో చేరడానికి పట్నానికి బయల్దేరాడు. వెళ్తూ తల్లి దగ్గర ఆశీస్సులు అందుకున్నాడు. 'అమ్మా! నేను పుట్టినప్పటి నుంచి ఊరు దాటింది లేదు. ఇక్కడే పుట్టి, పెరిగాను. ఈ వీధుల్లోనే తిరిగాను. పట్నం నాకు కొత్త. ఎలా మెలగాలో తెలియడం లేదు' అని వాపోయాడు కొడుకు. 'మంచివారితో స్నేహం చేస్తే చాలు నాయనా! నువ్వు అనుకున్న లక్ష్యం సాధిస్తావు. అదే చెడు సావాసం చేస్తే నష్టపోతావు' అని హెచ్చరించింది. 'ఎవరు మంచివాళ్లో, ఎవరు చెడ్డవాళ్లో గుర్తించడం ఎలా? దానికి నేనేం చేయాలి?' అని ప్రశ్నించాడు కొడుకు. అప్పుడు తల్లి.. గోడ వారగా వెళ్తున్న చీమల బారును చూపించి 'ఈ చీమంత తెలివి ఉంటే ఏ చీకూచింతా లేకుండా లోకమంతా చుట్టి రావొచ్చు' అని ధైర్యం చెప్పింది. ఆశ్చర్యంగా తల్లి వంక చూశాడు కొడుకు. వెంటనే ఆమె కాస్త చక్కెర తెచ్చి చీమల ముందుపోసింది. చకచకా వచ్చిన చీమలు చక్కెర ముక్కల్ని గబగబా తీసుకుని వెళ్లాయి. ఆ తర్వాత ఆమె... చక్కెర, ఉప్పురాళ్ల ముక్కలు కలిపి చీమల ముందర చల్లింది. చీమలు చక్కెర ముక్కల్ని మాత్రం తీసుకెళ్లి ఉప్పురాళ్ల ముక్కల్ని అక్కడే వదిలేశాయి. చీమలు చేస్తున్న పనిని కొడుక్కు చూపుతూ.. 'లోకమనేది మంచి చెడ్డల కలయిక. ఎక్కడికి వెళ్లినా.. మంచీ, చెడూ రెండూ ఉంటాయి. నీవు చేయాల్సినదంతా చీమలు చక్కెరను, ఉప్పును విడదీసినట్లు మంచి, చెడ్డ స్నేహితులను గుర్తించు. కళాశాలలో కొత్తగా స్నేహితులు పరిచయం అవుతారు. వారి నేపథ్యాలు, అభిరుచులు విభిన్నంగా ఉంటాయి. కాబట్టి వారిని కొన్నాళ్లపాటు జాగ్రత్తగా గమనించు. మంచివారు అనిపిస్తేనే వారితో స్నేహం చెయ్! చెడ్డవారిని దూరం పెట్టు!' అని సలహా ఇచ్చింది. ఆ మాటలతో విద్యార్థి ముఖం వెలిగిపోయింది. 'అలాగే అమ్మా!' అని తల్లి ఆశీస్సులు తీసుకొని పట్నం బయల్దేరాడు.


... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821




# అనంత వ్రతం.. అద్భుత ఫలప్రదం

మంగళ వారం అనంత పద్మనాభ స్వామి వ్రతం

**అనంతుడిపై** అత్యంత సుందరంగా పవళించి.. అనంత విశ్వాలనూ కాపుకాసే దేవుడు అనంత పద్మనాభుడు. స్వామి రూపంలో స్థితి మాత్రమే గోచరించదు. సృష్టికర్తతోపాటు, లయకారుడి తత్వాలూ స్వామి చిత్తరువులో దర్శనమిస్తాయి. అంటే సృష్టి, స్థితి, లయ తత్వాలకు ప్రతిబింబం స్వామి. పన్నగ శయనుడికి కావేరీ తీరం అచ్చొచ్చిందేమో! ఈ నదీమతల్లి తటిపై ఆది (శ్రీరంగపట్నం), మధ్య (శివసముద్రం), అంత్య (శ్రీరంగం) రంగాల్లో కొలువుదీరి భక్తుల హృదయాంతరంగాల్లో నయన మనోహరుడిగా పేరొందాడు. కావేటి రంగడు మన తెలుగు రాష్ట్రాల్లో రంగనాథుడిగా పలు ఆధ్యాత్మిక కేంద్రాల్లో వెలిసి నిత్యపూజలు అందుకుంటున్నాడు. ఆ స్వామి సేవలో తరించే అవకాశం కల్పిస్తుంది 'అనంత పద్మనాభ వ్రతం'. భాద్రపద శుద్ధ చతుర్దశి సందర్భంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. కష్టాలు తీరిపోవాలని, కోరికలు నెరవేరాలని ఈ వ్రతం నిర్వహిస్తారు. అరణ్యావాసంలో ఉన్న పాండవులు.. శ్రీకృష్ణుని సలహా మేరకు అనంత పద్మనాభ వ్రతం చేశారని పురాణ కథనం. ఆధ్యాత్మిక సాధనకు, ధర్మ కామ్య సిద్ధికి అనంత వ్రతం ఉత్తమ సాధనంగా చెబుతారు.

**పద్మనాభుడి** అర్చనలో మహావిష్ణువు పానుపు అయిన అనంతుడిని ఆరాధిస్తారు. వ్రతం విధివిధానాలు భవిష్యోత్తర పురాణంలో వివరించారు. పిండితోగానీ, దర్భలతోగానీ ఏడు పడగల సర్పాన్ని తయారుచేసి అష్టదళ పద్మ మంటపంపై గానీ, కలశంపై గానీ అనంతస్వామిని ప్రతిష్ఠించి షోడశోపచార పూజలు నిర్వర్తిస్తారు. కలశంలో పవిత్ర జలాలలో యమునా నదిని ఆవాహన చేసి వ్రతం కొనసాగిస్తారు. పూజలో భాగంగా 14 ముడులు కలిగిన ఎర్రని తోరాలను స్వామి దగ్గర ఉంచుతారు. తోరాలలోని 14 ముడులు ఒక్కో దేవతకు సంకేతంగా చెబుతారు. దిక్పాలకులు, రవి, వరుణుడు, అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, యముడు, బ్రహ్మ, చంద్రుడు, జీవుడు, శివుడు, వాయువు, అశ్విని దేవతల సాక్షిగా వ్రతాన్ని ఆచరిస్తున్నామని ఈ ముడుల ద్వారా తెలియజేస్తారు. వ్రత పరిసమాప్తి తర్వాత వాటిని దంపతులు తమ చేతులకు ధరిస్తారు. ఈ వ్రతాన్ని పాలీ చతుర్దశి వ్రతం అనీ, కదళీ వ్రతం అనీ పిలుస్తారు. ఒకసారి వ్రత దీక్షను స్వీకరించిన దంపతులు ఏటా తప్పకుండా ఆచరించాల్సి ఉంటుంది. కుదరని పక్షంలో ఎవరైనా వ్రతంలో ఉంచిన తోరాలనైనా తప్పనిసరిగా ధరించాలని పెద్దలు చెబుతారు. పౌర్ణమితో కూడుకున్న చతుర్దశి అయితే అనంత వ్రతానికి మరింత శ్రేష్ఠమని పెద్దల మాట.


... శ్యామ్‌ప్రసాద్


క్రీస్తు సందేశం



## సాటివాని ప్రేమ

**'నీవలె** నీతోటి మనిషిని ప్రేమించాలి' అంటాడు ప్రభువు. మనల్ని మనం ఎంత ప్రేమగా చూసుకోగలమో, అంతే ప్రేమతో సాటి వారినీ చూడాలి అని చెప్పడం తేలికే! కానీ, ఆచరణలో ఇది చాలా కష్టం. కానీ, ప్రేమ ఉంటే అది సాధ్యమే! ఆ ప్రేమ.. దేవుణ్ని ప్రేమించే ప్రేమ. అదే ప్రేమతో మనిషినీ చూడాలి. మనిషిలో దేవుణ్ని చూడగలిగితే, ప్రతిమనిషిలోనూ దేవుడున్నాడని నమ్మగలిగితే, అదే దేవుడు నీలో, నాలో, అందరిలోనూ ఉన్నాడనీ విశ్వసిస్తే.. మనిషికి శత్రువులు ఎందుకు ఉంటారు! అందరిలోనూ ప్రేమమయుడైన దేవుడున్నాడని నమ్మగలిగితే.. ద్వేషానికి తావులేదు. హింసకు అవకాశమే ఉండదు. ఒకడు మరొకణ్ని దోపిడీ చేయలేడు. సర్పాన్ని చూసి మనం భయపడతాం. వాస్తవానికి మనిషి అలికిడి కాగానే.. సర్పమే పక్కకు జారుకుంటుంది. అంతేగాని కనిపించిన మనిషిపైకి వచ్చి కాటువేయదు. కారణం మనం అంటే దానికీ భయమే! కానీ, మనిషి.. మరో మనిషికి భయపడుతున్నాడు. అందుకు కారణం ప్రేమ లేకపోవడమే. మానవత్వం అంటే ఏంటో తెలియకపోవడం, సానుభూతి మృగ్యం కావడంతోనే మనిషి.. మనిషికి శత్రువుగా మారుతున్నాడు. అందుకే ప్రభువు 'నీ దేవుణ్ని ఆరాధించు, పక్కవాణ్ని ప్రేమించు, దైవారాధనను ప్రేమలా మార్చుకో' (మార్కు 12:30-31) అని బోధించాడు. ఈ సత్యాన్ని గ్రహిస్తే అప్పుడు వైషమ్యాలు లేని సమాజం ఏర్పడుతుంది.


... ప్రొ॥ బెర్నార్డ్ రాజు,
98667 55024


# మానసిక సమత్వమే కర్మయోగం

యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః।
సమః సిద్ధా వసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే॥

(భగవద్గీత 4-22)

**అయాచితంగా** లభించిన పదార్థాలతో సంతృప్తి చెందినవాడు, అసూయ లేనివాడు, సంతోషం-దుఃఖాలకు అతీతమైనవాడు, చేసే పని సిద్ధించినా, సిద్ధించకపోయినా సమంగా తీసుకునేవాడినే కర్మయోగి అంటారు. అలాంటి కర్మయోగి కర్మలను ఆచరించినా వాటి బంధనాల్లో చిక్కుకోడు. పనులు చేసేప్పుడు మన ప్రయత్నం ఏమీ లేకపోయినా విజయం కలగవచ్చు. ఒక్కోసారి ఎంత ప్రయత్నించినా అపజయం పాలుకావచ్చు. విజయం కలిగితే సంతోషం, అపజయంలో దుఃఖం కలగడం సాధారణమే. మనకు దక్కని విజయం ఇతరులకు దక్కినప్పుడు వారిపై అసూయ కలగడమూ కొంతవరకు సహజమే. అయితే ఎవరైతే వీటికి అతీతంగా స్పందిస్తారో వారిని కర్మయోగులు అంటున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగుల మనసు... సంఘర్షణలకు అతీతంగా స్పందిస్తుంది.




స్వార్థ ప్రయోజనాల కోసం చేసే కర్మల వల్ల సమాజానికి శ్రేయస్సు కలగదు. అలాంటి కర్మలను దుష్కర్మలుగా చెబుతారు. సామాజిక ప్రయోజనం లక్ష్యంగా చేసే కర్మలను సత్కర్మలుగా పేర్కొన్నారు. జగమంతా భగవంతుడి ఆవిష్కరణే అన్న భావన కలిగినప్పుడే ఎదుటివారిపై సమదృష్టి కలుగుతుంది. ఉద్యోగాలు చేసినా, వ్యాపారాలు చేసినా.. చేసే పనిలో నిబద్ధత, అంకితభావం, శ్రద్ధ, జవాబుదారీతనంతో పనిచేస్తే సంతృప్తితోపాటు సత్ఫలితమూ కలుగుతుంది. ఒకనాడు ఎక్కువ లాభం కలిగినా, తక్కువ లాభం వచ్చినా, నష్టం వచ్చినా.. పొంగిపోకుండా, కుంగిపోకుండా సమంగా మనసు నిలుస్తుంది.

ఒక సంస్థ ప్రక్రియపై దృష్టిపెట్టి పనిచేస్తుంది. మరొక సంస్థ ఫలితాలపై దృష్టిపెడుతుంది. ప్రక్రియపై దృష్టిపెట్టిన సంస్థకు 'ఆశయం' ఉంటుంది. న్యాయంగా, ధర్మంగా వ్యాపారం చేస్తుంది. ఫలితాలు ఎలా వచ్చినా దానిని పట్టించుకోదు. ఫలితాలపై దృష్టి సారించిన సంస్థకు 'ఆశ' ఉంటుంది. దానికి న్యాయాన్యాయాల కన్నా ఆశించిన ఫలితం రావడమే ప్రధానం. ఆశించడం ఘర్షణకు దారితీస్తుంది. ఆశించకుండా ఏది, ఎంత వచ్చినా సంతృప్తినిస్తుంది. జయాపజయాలలో సమస్థితిని పొందుతూ ప్రశాంతంగా ఉండటానికి సాధన అవసరం. సంఘర్షణలో ఘర్షణను కాకుండా ప్రశాంతతను ఆహ్వానించేవారే కర్మయోగులు అవుతారు.

ఒక రాజుకు ఓ సాధువు అడవిలోని పండును ఒకదానిని ప్రతిరోజూ ఇచ్చేవాడు. సాధువు వెళ్లగానే రాజు ఆ పండును బయటకు విసిరివేసేవాడు. ఒకనాడు ఆ పండును ఒక కోతి తీసుకొని కొరికింది. ఆశ్చర్యంగా పండు మధ్యలో ఒక మణి బయటపడింది. రాజుకు ఆశ్చర్యం వేసి తాను పారవేసిన పండ్లన్నీ విప్పి చూశాడు. ప్రతిపండులోనూ ఒకమణి ఉన్నది. అతనికి జ్ఞానోదయమైంది. వెంటనే సాధువు దగ్గరికి వెళ్లి సాష్టాంగపడ్డాడు. సాధువు ఇచ్చింది అడవిలోని పండు అని బాహిరమైన రూపాన్ని చూసి అసహ్యించుకున్నాడే కానీ, అంతరంగంలోనికి చూడగలిగితే లోతైన 'అవగాహన' కుదిరేది. నిజానికి జయాపజయాలు, సుఖదుఃఖాలు సాపేక్షాలే కానీ, రెంటికి అతీతమైన 'మనసే' సత్యాన్వేషణకు దారిచూపుతుంది.

పదాలకు అతీతమైనది భావన. ఆ భావనను అందుకునేందుకు సాధన కావాలి. సాధనలో ద్వంద్వాలకు అంటే లాభనష్టాలకు, సుఖదుఃఖాలకు అతీతమైన మానసిక స్థితి కుదురుతుంది. ఆ స్థితిలో చేసే పనిలో సమగ్రత సంపూర్ణతలు ఆవిష్కృతమవుతాయి. అయాచితంగానే ఫలితాలు అందివస్తాయి. ఆ ఫలితాలను సమాజంతో పంచుకునే విజ్ఞత వెలుగు చూస్తుంది. అసూయ, విభ్రాంతి, మాత్సర్యం లాంటి స్థానంలో ప్రేమ ఆప్యాయతలు చిగురిస్తాయి. రాయిరప్పల లాంటి జడ్వత్వం నుండి చెట్టుచేమల స్థాయికి, అటునుంచి పశుస్థితికి, ఆ తర్వాత మనుష్యస్థితికి, అటుపై దైవత్వానికి పరిణతి చెందడం జరుగుతుంది.


... పాలకుర్తి రామమూర్తి


# స్మరణీయం.. ప్రవక్త జీవనం

నేడు మిలాద్ ఉన్ నబీ

**ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పుట్టకముందే తండ్రిని, తొమ్మిదేండ్ల ప్రాయంలో తల్లిని కోల్పోయారు. అనాథగా ప్రారంభమైన ఆయన జీవితం కష్టాల కడలిలో ఎదురీతలాగా సాగింది. ఎంతో సాధన చేసి స్వయంకృషితో ప్రవక్తగా రాణించారు. చక్రవర్తిగా ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ప్రవక్త (స) తుదిశ్వాస వరకూ ఎన్నో ఆదర్శాలను ఆచరించి చూపారు. దేవుడొక్కడే, మనుషులంతా ఒక్కటేనని చాటి చెప్పి అరబ్బు సమాజాన్ని సమూలంగా మార్చేశారు. హిరా గుహలో దైవవాణి ఆదేశం మేరకు ప్రవక్త బాధ్యతను స్వీకరించారు. కత్తితో సాధించలేనిది కరుణతో సాధించారు. మానవాళికి నైతిక జీవిత పాఠాలు బోధించారు. అందుకే ఆయన ఈ లోకం వీడి 1500 సంవత్సరాలైనా ప్రపంచం నలుమూలలా ప్రవక్తను స్మరించుకుంటూనే ఉన్నారు. ఆయన జీవితంలోని కొన్ని ముఖ్యమైన ఘటనలు మనకు మార్గదర్శనం చేస్తాయి.**

### ప్రేమానురాగాలు ముఖ్యం

ఒకసారి ఒక గ్రామీణుడు ప్రవక్త (స) దర్బారుకు వచ్చాడు. ఆ సమయంలో మహాప్రవక్త (స) తన మనుమడు హసన్ (రజి)ని ముద్దాడుతున్నారు. గ్రామీణుడికి అది ఓ వింతగానూ, పరువు ప్రతిష్ఠలకు విఘాతం కలిగించే విషయంగానూ తోచింది. 'మీరు పిల్లల్ని ముద్దాడుతారా?! నాకు పదిమంది పిల్లలున్నారు. వారిలో ఏ ఒక్కరినీ ఇంతవరకు ముద్దాడలేదు' అని ప్రవక్తతో అన్నాడు. ప్రవక్త (స) ఆ వ్యక్తిని తేరిపార చూసి, 'దయ చూపనివాడు దయకు నోచుకోడు' అని బదులిచ్చారు.

### ఆడపిల్లలు స్వర్గానికి మార్గాలు

ఒకసారి హజ్రత్ ఆయిషా సిద్దీఖా దగ్గరకు ఒక నిరుపేద యాచకురాలు వచ్చింది. ఆమె వెంట ఇద్దరు ఆడ పిల్లలున్నారు. ఆ సమయంలో ప్రవక్త (స) కుటీరంలో ఒక్క ఖర్జూరపు పండు తప్ప మరేమీ లేదు. అప్పుడు హజ్రత్ ఆయిషా ఆ ఒక్క ఖర్జూరాన్నే యాచకురాలికి దానం చేశారు. అప్పుడు ఆమె ఆ ఖర్జూరాన్ని రెండు ముక్కలుగా చేసి తన ఇద్దరు పిల్లలకు సమంగా పంచిపెట్టింది. ఆ తల్లి మమకారం హజ్రత్ ఆయిషాకు ఆశ్చర్యం కలిగించింది. ఆయిషా ఆ ఘటనను ప్రవక్త (స)కు వివరించింది. 'ఆడపిల్లల పట్ల మంచిగా ప్రవర్తిస్తే వాళ్లు నరకాగ్నికి అడ్డు తెరగా నిలుస్తారు' అని ప్రవక్త(స) అన్నారు.

### మంచితనమే స్వర్గానికి అర్హత


ప్రవక్త (స) కాలంలో ఇద్దరు మహిళలు విరుద్ధ భావాలు కలిగి ఉండేవారు. వారిలో ఒకామె రాత్రంతా నమాజులో లీనమై ఉండేది. పగటిపూట ఉపవాస వ్రతాలు పాటించేది. విస్తృతంగా దానధర్మాలు చేసేది. కానీ ఆమె తన నోటి దురుసుతనం వల్ల ఇరుగుపొరుగు వారిని ప్రశాంతంగా బతకనిచ్చేది కాదు. రెండో మహిళ కేవలం ఫర్జ్ నమాజులు చేసేది. మాటలు, చేతలతో ఎవరినీ నొప్పించేది కాదు. ఆ ఇద్దరు మహిళల గురించి ప్రవక్త (స) దగ్గర ప్రస్తావించగా.. 'మొదటి మహిళలో మంచితనం లేదు. తన దుష్ప్రవర్తనకు శిక్షను అనుభవిస్తుంది. రెండో మహిళ మంచితనంతో స్వర్గంలో స్థానం సంపాదిస్తుంది' అని అన్నారు.

### కఠిన శిక్షలు వద్దు

ఒకసారి ఒకతను దుప్పటి కప్పుకొని నిద్రపోతుండగా, మరో వ్యక్తి వచ్చి నెమ్మదిగా ఆ దుప్పటిని దొంగలించాడు. బాధితుడు న్యాయం కోరుతూ ప్రవక్త (స)కు జరిగిన ఉదంతం వివరించాడు. అప్పుడు ప్రవక్త (స).. దుప్పటి దొంగతనం చేసిన వ్యక్తి చేతులు నరికివేయాలని తీర్పునిచ్చారు. ఆ తీర్పునకు కక్షిదారు హతాశుడయ్యాడు. దొంగపై జాలి కలిగింది. 'కేవలం దుప్పటి కోసం ఒక మనిషి చేతులు నరికివేస్తారా? నేను ఈ దుప్పటిని ఈ దొంగకు అప్పుగా ఇస్తున్నాను. అతడిని వదలిపెట్టండి' అని విన్నవించాడు. 'ఇంతకుముందే ఈ పని ఎందుకు చేయలేదు' అని ప్రవక్త (స) ఫిర్యాదుదారును మందలించారు.

### అసలు దరిద్రులెవరో తెలుసా?

ఒకసారి ప్రవక్త (స) తన సహచరులను ఉద్దేశించి 'దరిద్రుడు ఎవరో మీకు తెలుసా?' అని అడిగారు. దానికి వారు 'డబ్బు, ఖరీదైన వస్తువులు లేనివారే దరిద్రులు అని మేము భావిస్తున్నాం' అని అన్నారు. 'వారు కాదు దరిద్రులు. ప్రళయ దినం నాటికి తన ఖాతాలో దుష్కర్మలు కలిగినవారే అసలైన దరిద్రులు' అని ప్రవక్త (స) వారికి బదులిచ్చారు. తర్వాత పహిల్వాన్ ఎవరో మీకు తెలుసా? అంటూ ప్రవక్త (స) తన సహచరులను అడిగారు. 'కుస్తీలో పైచేయి సాధించేవాడే పహిల్వాన్' అన్నారు వారు. 'అసలు పహిల్వాన్ అతను కాదు. కోపం, ఆవేశం వచ్చినప్పుడు తనను తాను నిగ్రహించుకున్నవాడే అసలైన పహిల్వాన్' అని ప్రవక్త (స) తెలిపారు.



### స్వర్గం ఎవరి కోసం?

ఒకసారి ప్రవక్త (స) స్వర్గం గురించి చెప్తూ దానిలోని భోగభాగ్యాలను వివరించారు. ఒక పల్లెటూరి సహచరుడు ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరై, 'దైవప్రవక్తా, ఇంతకీ ఈ స్వర్గంలో ఎవరికి ప్రవేశం లభిస్తుంది' అని ప్రశ్నించాడు. 'మృదుభాషికి, ఆకలితో ఉన్నవారికి అన్నంపెట్టేవారికి, ఎక్కువగా ఉపవాసాలు పాటించే వారికి, లోకమంతా నిద్రిస్తున్న సమయంలో నమాజులు చేసేవారికి' అని ప్రవక్త సమాధానమిచ్చారు. ఒక మంచి మాట కూడా దానంతో సరి సమానమని మరో సందర్భంలో చెప్పారు.

### అతిథి సేవ ముఖ్యం

ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త (స) దగ్గరికి బాగా ఆకలితో వచ్చాడు. ఆ సమయంలో ప్రవక్త కుటీరంలో మంచి నీళ్లు తప్ప మరేమీ లేదు. అందువల్ల ఆయన తన సహచరులను ఉద్దేశించి, ఈ రోజు రాత్రి ఈ వ్యక్తికి ఆతిథ్యమిచ్చే వారిపై అల్లాహ్ దయ చూపుతాడని అన్నారు. అన్సార్ సహాబీ అనే వ్యక్తి ఆ అతిథిని తన ఇంటికి తీసుకెళ్లారు. అయితే ఇంట్లో పిల్లలకు సరిపడా అన్నం మాత్రమే ఉందని అతని భార్య చెప్పింది. 'పిల్లల్ని ఎలాగో బుజ్జగించి నిద్రపుచ్చు. ఇంట్లోని దీపం ఆర్పివేయి. మనమిద్దరమూ భోజనం చేస్తున్నట్లుగా నటిద్దాం. మనం పస్తులున్న విషయం అతిథికి తెలియకూడదు' అని తన ఇల్లాలికి చెప్పారు. ఆమె భర్త చెప్పినట్లే చేసింది. ఈ విషయం ప్రవక్త (స)కు దైవవాణి ద్వారా తెలిసి ఆ సహచరుడిని ఎంతగానో మెచ్చుకున్నారు.


... ముహమ్మద్ ముజాహిద్
96406 22076